# దొంగతనం

రచయిత:

## ప్రయాగ కోదండరామశాస్త్రి

"నన్ను చూచి 'దొంగ! - దొంగ?' అనే పెద్ద మనుష్యుల్ని చూస్తే నాకు ఒక్కొక్క సారి జాలి వేస్తుంది, ఒక్కొక్క సారి కోపం వస్తుంది. వారలా అంటూవుంటే, నేను దొంగ నేనా అని అప్పుడప్పుడు ఆలోచిస్తూ వుంటాను. నేను దొంగనే అని ఒప్పుకుంటాను. అయినప్పటికీ నన్ను దొంగఅనే అధికారం వాళ్ళకు లేదనిమాత్రం వాదిస్తాను. నన్ను దొంగగా తయ్యారు చేసింది వాళ్లు; నాకు ఈ వృత్తి కన్న మరోవృత్తిఅంటే- మర్యాదగా బ్రతికే వృత్తి వుంటే ఈవృత్తికి ఎప్పుడూ పాల్పడివుండను,- ఇంతకన్నా వృత్తిలేకుండాచేసి ఇప్పుడు 'దొంగ-దొంగ-' అనే అధికారం వాళ్ళకు (నన్నిలాచేసిన వాళ్ళకు-) లేదు.

నిజంగా లోకం అర్థంచేసుకోగలిగితే, మహాత్ములను కొనబడేవారి చరిత్రలకన్న నాచరిత్ర లోకానికి ఎక్కువ ఉపకరిస్తుందని నా ఉద్దేశం. లోకంలో వ్యక్తిత్వం, ఆత్మగౌరవం ఉద్రేకించిన ప్రతివ్యక్తీ దొంగగానో, లంజెగానో తయ్యారుకావడం సహజం అనికూడా విశ్వసిస్తాను. లోకానికి అవసరమని సేవనుకొంటున్న నాచరిత్రలోని కొన్ని అంశాలను సంగ్రహంగా తెలియజేస్తాను:

ఆనాడు ముసురుపట్టింది. విపరీతంగా జల్లు కొడుతూంది. కాల్చుకొందాంగదా అని సిగరెట్ కోసం గూళ్ళన్నీ వెదకాను. ఎక్కడా ఒక్క సెకండ్-హాండ్ పీక అయినా దొరక్కపోవడంతో మరీ గొంతు ఎండుకుపోమొదలెట్టింది. ఆముసురులోనే, ఆజల్లులోనే బజారుకు పోయాను. కొట్టువాణ్ణి ఒక సిగరెట్ ఇవ్వమని కోరాను. నిరాకరించాడు. పోనీ ఈతడవ కొన్నప్పుడు చెల్లుబెట్టుకోమన్నాను. అప్పుడే యిస్తాలెమ్మన్నాడు. అక్కడే కుర్చీలపైన కూర్చొని 'ఈ మేఘాలన్నీ మేము సృష్టించినవే' అనేంత టీకుతో గాలిలోకి పొగవదలుతున్నవాళ్ళను చూస్తే గొంతులో తడి మరీ ఆరిపోజొచ్చింది. అభిమానం గిభిమానం నాకేమీ పట్టలేదు. ఒక బీడీ అయినా ఇమ్మని వారిని దేవిరించాను. కొందరు చప్పరించారు, కొందరు 'లేదుబ్రదర్' అని (జేబులో వుంచుకొనే-) సానుభూతి వెలిబుచ్చారు. చూస్తూ అక్కడే కూచున్నాను. ఒక్క గొడుగులో ఇద్దరువచ్చి ఒక సిగరెట్ పెట్టె కొనిపోబోతున్నారు. తడుస్తూ వాళ్ళ దగ్గరకుపోయి 'ఒకసిగరెట్ ఇస్తారా' అని వేడుకొన్నాను. 'సాహుకారును అడుగు-' అంటూ సాగిపోయారు వారు. సాహుకారుదగ్గరే కూర్చొని మరీ మరీ దేవిరించాను. 'నీవు అసలు ఇక్కడనుంచి పొ'మ్మని హుకుంచేసాడు. పోకుండా కూర్చున్నట్టు కూర్చొని ఒకసిగరెట్ పెట్టె కాజేసి, బొడ్లోపెట్టుకొని 'ఇవ్వవు కాదూ-' అంటూ నెమ్మదిగా బయిలుదేరాను.

సాహుకారు సిగరెట్ పెట్టె పోయిందని గమనించాడు. నావెంటబడి నన్ను పట్టుకొన్నాడు. నాదగ్గర వున్న సిగరెట్ పెట్టె దూరంగా విసిరేసి, 'నాకేమీ తెలే'దన్నాను. తలొకదెబ్బ కొట్టారు. కావలెనంటే కొనుక్కోరాదా? అన్నారు. డబ్బులేదన్నా. అంతడబ్బులేనివాడివి ఎందుకు త్రాగాలి? అన్నారు. మున్సిఫ్ దగ్గరకు పట్టుకెళ్లారు. మున్సిఫ్ నాలుగుతన్ని

పోలీస్‌స్టేషనుకు పంపాడు. వాళ్ళూ ఓపిక ఉన్నంత వరకు కొట్టి కోర్టుకు పట్టుకెళ్లారు. కోర్టువారు ఆరు వారాలు కఠినశిక్ష వేసారు.

జైలు అయిపోయింది. ఇంటికి వచ్చాను. ప్రతివాడూ నన్నో వింతజంతువునుగా జూడ మొదలెట్టారు. నాకు మహా అసహ్యంగావుంది. ఎవడివద్దనైనా పనిచేస్తానంటే,—'ఏందొబ్బుకుపోతావో - వద్దులే-' అంటున్నారు.

కొన్నాళ్లు గడచినవి.

నాజీవితం నాకే దుర్భరంగా తోచింది. ఆత్మహత్య చేసుకొందామని చాలసార్లు తీవ్రంగా ఆలోచించాను. మావూళ్ళోవున్న డాక్టర్నికూడా అనేక పర్యాయములు ఏదో ప్రస్తాపవశంగా 'ఏంతింటే చస్తారు?- ఏమిటి?' అంటూ అడుగుతూవుండేవాణ్ణి. గచ్చకాయ, నల్లమందూ ఇలాంటివంటే నాకు ఏమిటో వెగటు. ఏదన్నా తియ్యని ఇంగ్లీష్ విషంత్రాగి చనిపోవాలని వుండేది. ఎందువల్లనో, కారణం యిప్పుడు చెప్పలేను- నాలోనుండి ఆప్రయత్నం తొలగిపోయింది. నాలోనున్న వ్యక్తిత్వం ముందుకొచ్చింది.

నేనూ, ఒక స్నేహితుడూ కలిసి ఊరిబయటికి షికారువెళ్లాము ఒకనాడు. మాట్లాడుతూ, మాట్లాడుతూ వుండగానే ప్రొద్దుపోయింది. వద్దామని యింటికి వస్తూవుండగా ప్రక్కవూరి సావుకారు ఒంటరిగా పోతూవున్నాడు. ఇద్దరమూ కలిసి వాణ్ణి కొట్టాము. వాడివద్ద పాతికరూపాయలు దొరకినవి.

ఊళ్ళోవుండకుండా 'బెజవాడ'కు రైలెక్కాము. సిజర్‌సిగరెట్లూ, కాఫీహోటలూ ఆరాత్రి- ఒక్కయువతి తక్కువగా- దేవేంద్రభోగం అనుభవించాము. ప్రొద్దున కాఫీత్రాగి జేబు చూచుకొనేప్పటికి పదిరూపాయలుమాత్రం వున్నవి. రెండు దోవతులూ రెండు తుండుగుడ్డలూ కొని, హోటల్లో భోజనంచేసి, సాయంత్రందాకా బజారువెంటతిరిగాము.

సాయంత్రం 5 గంటలకు ఒకకారు బొమ్మలకాగితాలను వెదజల్లుతూపోయింది. చూస్తే ఇంగ్లీష్‌ఫిలిం అని తేలింది. చూదామనిపించింది.

సినిమాచూచి బయటికి వచ్చేప్పటికి జేబులోవున్న పైకం మూడణాల మూడుకానులు. వున్నసరుకు నాలుగు సిజర్ సిగరెట్లుగల ఒకప్యాకెట్టూ, సగంకాళీ అయిన ఓ అగ్గిపెట్టే, మడిచిపెట్టుకొన్న సినీమా నోటీస్ కాగితమూ, సగంచింపిన టిక్కెట్టుముక్కా- గాజుపాళీ వాటర్‌మన్ పెన్నూ.

తిండి ఎలాఅనే చర్చ జరిగింది. హోటల్లో భోంచేసి ముందరి కిల్లీకొట్టుదగ్గర కిల్లీనములుతూవున్నట్టువుండి సాగిపోదామని తేల్చుకొన్నాము.

అనుకొన్నంతా చేసాము. స్టేషన్‌కువచ్చి రెండు ప్లాట్-ఫారంటిక్కెట్లుకొని, రైలు సాగేవేళకు బండి ఎక్కాము. గుడ్స్‌షెడ్ ప్రక్కనదిగి, గేటు తిరిగి కొంపలను చేరాం. ఒక్క అరగంటకే పోలీసులు ఇద్దర్నీ కచేరీకి చేర్చారు. తర్వాతిపని యథాప్రకారంగానే జరిగింది. మాఇద్దరికీ చెరి ఆరునెలలూ భోజనం గ్రాంటుచేసింది ప్రభుత్వం.

జైలులోని నా అనుభవాలను మరోసారి విన్నవించుకొంటాను. ఆసారితో నాకు జైలన్నా, ప్రభుత్వం అన్నా వున్నభయం పటాపంచలైపోయింది. ఇంతకన్నా ఏంచేస్తుంది ప్రభుత్వం? అనే ధీమా ఏర్పడింది. క్రమంగా దొంగతనమే నావృత్తి అయిపోయింది.

దొంగతనాన్ని నావృత్తిగా చేసుకొనేందుకు నేనేమీ ప్రయత్నించలేదు. అణచబడిన నా అవసరాలు అప్పుడప్పుడు నన్నుద్రేకపరుస్తుండేవి. ఎప్పుడో వీలైనప్పుడు వీలయినట్లు ప్రవర్తించవలసివచ్చేది.

ఇప్పటికి- ఈ దొంగతనం వృత్తికావడంవల్లా, ఏడాదికి తొమ్మిదినెలలు ధర్మసత్రం కనుకా సోమరిగా తయ్యారయినాను. నేను నావంటి ఎవ్వరికీ దొంగతనం చేయవలసిందని సలహా యివ్వనుగాని, చేసే నావంటివాణ్ని- అంటే లేనివాణ్ని అభినం

దిస్తాను. వాడిలోవున్న అభిమానం వ్యక్తిత్వం వాణ్ణలా పురికొల్పినవని నమ్ముతాను. నావృత్తిని మీరు గౌరవించరని నాకు తెలుసు. మీరేకాదు, నేనుకూడా గౌరవించను. మనంగౌరవించని ఈవృత్తి లేకుండా చేయడానికి మనం యత్నించాలి. అది ఎలా నిర్మూలింపబడుతుందో నాకు తెలుసు :

దౌర్జన్యంతో సాధ్యంకాదు. అది ఏకారణంవల్ల జరుగుతున్నదో అర్థంచేసుకొని ఆకారణంలేకుండా చేస్తే పోతుంది. ఆకారణం ఏమిటి? దరిద్రం.

దరిద్రంలేకుండాపోతే దొంగతనం వుండదని నేను గట్టిగా చెప్పగలను. లేకుండా చేయగలను కూడా.

ఈదరిద్రం అనే మహాసమస్యను అనేక తత్వాలు ఎదుర్కొంటున్నవి. కాని, ఒక్క-సామ్యవాదం తక్క-ప్రతిదీ ఫెయిల్ అవుతున్నది. ఆసామ్యవాదం అనే పేరు వింటేనే ధనికసంఘం (ప్రభుత్వంలో వున్న సంఘం-) తన ప్రత్యేకత పోతుందని అణచి వేస్తున్నది.

ఇలాంటప్పుడు దరిద్రమూపోదు, దొంగతనమూ పోదు. ఒక పోలీస్ స్టేషన్‌కు పది స్టేషన్‌లు కట్టించినా ఈ దొంగతనంపోదు. పోదుగదా, విపరీతంగా పెరిగిపోతుంది.

... ... ...

నాకుతోచిన అంశాలను మీముందు పెట్టడమే నావిధి. మీరు ఎలా అనుకొన్నా ఇందులోని ప్రతి అంశమూ యథార్థమని ప్రత్యక్షంగా అనుభవంగల నేను ధ్రువపరుస్తున్నాను.

ముందు ముందు మీదయవుంటే నాజైలు అనుభవాలనుకూడా అందజేస్తాను.''

